క్లుప్తంగా

బాపట్ల టీచింగ్ హాస్పిటల్ నిర్మాణ పనులు ప్రారంభించాలి



బాపట్ల: బాపట్లలో నిలిచిపోయిన టీచింగ్ హాస్పిటల్ పనులు పునఃప్రారంభించేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను బీజేపీ నాయకులు కోరారు. మంత్రిని ఆయన నివాసంలో సోమవారం కలిసిన బీజేపీ నాయకులు పనులను వెంటనే ప్రారంభించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. టీచింగ్ హాస్పటల్ వలన మెడికల్ విద్యార్థులకు శిక్షణ, పరిశోధన అవకాశాలు ఉండటమే కాకుండా రోగులకు మెరుగైన వైద్యసేవలందుతాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణతో పాటు పలువురు కోరారు. ఈవిషయాలపై స్పందించిన మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఏడాదిలోపు హాస్పటల్ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బలిజేపల్లిలో ఉచిత వైద్యశిబిరం



వేమూరు: పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరం ద్వారా వైద్య సేవలు అందించడం జరిగిందని గుంటూరు చెందిన ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్స్ వైద్యులు తేజస్విని తెలిపారు. వేమూరు మండలంలోని బలిజేపల్లి గ్రామంలో మండల పరిషత్ పాఠశాల ఆవరణలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆంధ్ర ప్రైమ్ హాస్పటల్ జనరల్ ఫిజీషియన్ అచింశెట్టి అన్వేష్, పలువులు జూనియర్ వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించారు. ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జొన్నలగడ్డ విజయబాబు, వైద్యుల బృందం ఎల్.బి.రాజేష్, ఎం.రాజ్ కుమార్, జె.అనుపమ్, దేవరాజ్, హర్షిత, సాహెబా పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో తేనె విక్రయ దుకాణం



తెనాలిరూరల్: స్వయం ఉపాధి పథకం కింద మండలంలోని అంగలకుదురు గ్రామానికి చెందిన నీలాంబరి డ్వాక్రా సంఘం సభ్యురాలు కడియాల లక్ష్మి తెనాలి రైల్వేస్టేషన్‌లో తేనె విక్రయ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. డీఆర్‌డీఏ సహకారంతో పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్టాల్‌ను ఏర్పాటు చేసినట్టు నిర్వాహకురాలు లక్ష్మి తెలిపారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్టాల్‌ను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, జగన్, ప్రసాద్, గోగినేని లోకేశ్వరి, గద్దెల శైలజ పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి గౌరవాధ్యక్షుడు కాసా రామశ్రీను జన్మదినాన్ని పురస్కరించుకుని బుర్రిపాలెం రోడ్డులోని గోశాలలో సోమవారం గోవులకు దాణా పంపిణీ చేశారు. అనంతరం రైల్వేస్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృందం సేవా సమితి అన్నదాన కేంద్రంలో పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను మాట్లాడుతూ రామశ్రీను ఇప్పటి వరకు 59 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో షేక్ మీరావలి, షేక్ అబ్దుల్ మతీన్, మునిపల్లి వంశీ, పోతురాజు, ఆషా, శివ, అబ్రహాం, తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంల్లో నిలిచిన నగదు లావాదేవీలు



తెనాలిటౌన్: 2025 మార్చి 31 నెలాఖరు కావడం వలన ఏటీఎంల్లో నగదు లావాదేవీలు దాదాపుగా నిలిచిపోయాయి. దీని వల్ల ఖాతాదారులు నగదు విత్ డ్రా చేసుకునేందుకు వచ్చి తీవ్ర నిరాశకు గురయ్యారు. గత రెండు రోజులుగా దాదాపుగా అన్ని బ్యాంకులకు సంబంధించిన ఏటీఎంలలో నగదు రావడం లేదని, ఎస్‌బీఐ మినహా మరికొన్ని బ్యాంకులు ఏటీఎంల షట్టర్‌లు క్లోజ్ చేసి ఉంచారని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. పట్టణంలో అక్కడక్కడ ఎస్‌బీఐ ఏటీఎంలలో నగదు విత్ డ్రా చేసుకునే సదుపాయం అందుబాటులో ఉన్నట్లు బ్యాంకు అధికారులు చెబుతున్నారు. మార్చి 1వ తేదీ కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుందని అధికారుల విశ్వసనీయ సమాచారం. కావున ఖాతాదారులు ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నారు.



జంపనిలో ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో ముస్లింలు



కొల్లూరు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు

భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

- ముగిసిన నెలరోజుల కఠిన ఉపవాసాలు
- మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకొన్న ముస్లింలు

కర్లపాలెం: పవిత్ర రంజాన్ పండుగను ముస్లింలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ముస్లింలు నెలరోజుల పాటు చేసిన ఉపవాస దీక్షలు రంజాన్ పండుగ ప్రార్థనలతో ముగిశాయి. పండుగ సందర్భంగా యువకులు, పెద్దలు, చిన్నారులు నూతన వస్త్రాలు ధరించి దండుబాట సమీపంలోని ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరికొకరూ ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈసందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ రంజాన్ నెల ఉపవాస దీక్షలు మొదటి పది రోజులు దైవానుగ్రహం, తర్వాతి పది రోజులు దైవ క్షమాపణ లభిస్తుందని చెప్పారు. ఆఖరి పదిరోజులు నరక శిక్షనుంచి ముక్తి లభిస్తుందని వివరించారు. రంజాన్ నెలలో ఉపవాస దీక్షలు చేస్తూ దైవారాధన చేయటం వలన ఆకలి బాధలు తెలియటంతో పాటు తప్పులు క్షమింపబడతాయని తెలిపారు.

- వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు నల్లరిబ్బన్లు ధరించి ప్రార్థనలలో పాల్గొన్నారు. కర్లపాలెంలోని పాత ఇస్లాంపేట, దండుబాట, ఐలాండ్ సెంటర్‌లోని మసీదులతో పాటు పేరలి, గణపవరం, నాగరాజుపాలెం గ్రామాలలోని మసీదులు, ఈద్గాల వద్ద రంజాన్ ప్రార్థనలు చేశారు. పండుగను పురస్కరించుకుని ముస్లింలు తమకు ఉన్నంతలో పేదలకు దానధర్మాలు చేశారు.

పిట్టలవానిపాలెంలో..

రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లింలు చందోలు గ్రామంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహించారు. గత నెలరోజులుగా చేస్తున్న ఉపవాస దీక్షలు రంజాన్‌తో ముగిశాయి. పండుగ సందర్భంగా చిన్నలు పెద్దలు రంజాన్ ప్రార్థనలలో పాల్గొన్నారు. ఒకరికొరకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.



అమర్తలూరులో ఈద్గా వద్ద రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు

వేమూరులో...

వేమూరు: వేమూరు నియోజక వర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లో ముస్లింలు సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈద్గాలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కర్లపాలెం ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రేపల్లె ప్రత్యేక ప్రార్థనలు

రేపల్లె రూరల్: రంజాన్ పర్వదిన వేడుకలను నియోజకవర్గంలో ముస్లింలు సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. రేపల్లె పట్టణంలో వివిధ మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పలువురు ముస్లింలు ర్యాలీగా ఉయ్యూరువారిపాలెం రహదారిలోని ఈద్గాకు ర్యాలీగా చేరుకున్నారు. ఈద్గాలో మత పెద్దలు ప్రత్యేక సందేశాన్నిచ్చారు. నమాజులు అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్‌ముబారక్ తెలుపుకొన్నారు. కార్యక్రమంలో ఈద్గా కమిటీ సభ్యులు, ముస్లింలు పాల్గొన్నారు.



చిన్నారుల ఆత్మీయ ఆలింగనం

కొల్లూరులో ప్రత్యేక ప్రార్థనలు

కొల్లూరు: రంజాన్ పర్వదిన వేడుకలు సోమవారం మండలంలో అత్యంత ఘనంగా జరిగాయి. ముస్లింలు కొల్లూరులోని మసీదులో నమాజ్ ముగిసిన అనంతరం క్రాప రోడ్డులోని ఈద్గా వద్దకు తరలివెళ్లారు. మతపెద్దల సూచనలను అనుసరించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఖబరస్తాన్‌కు తరలివెళ్లి తమ పూర్వీకుల సమాధులపై పుష్పాలను ఉంచి వారిని స్మరించుకున్నారు. పేదలకు దానధర్మాలు చేయడంతోపాటు, బంధువులతో కలసి సంతోషంతో గడిపారు. చిన్నారులు, పెద్దలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆత్మీయ ఆలింగనాలతో రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ప్రార్థనల్లో మండలంలోని కొల్లూరు, ఈపూరు, అనంతవరం, బొద్దులూరుపాడు తదితర గ్రామాల నుంచి తరలివచ్చిన ముస్లింలు పాల్గొన్నారు.

3న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కర్లపాలెం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 3వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యుడు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ప్రతి ఒక్కరూ దాన గుణం కలిగి ఉండాలి



తెనాలిటౌన్: ప్రతి ఒక్కరూ దాన గుణం కలిగి ఉండాలని కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాల్లో రంజాన్ పండుగ ముస్లిం మైనార్టీలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నా రు. కొలకలూరులోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, పలువురు ముస్లిం మైనార్టీలు పాల్గొన్నారు.

శివాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా కోటేశ్వరరావు

మంగళగిరి టౌన్: మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబా సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు చైర్మన్‌గా బోగి కోటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌తో పాటు ఎనిమిది మందిని ట్రస్టు బోర్డు డైరెక్టర్లుగా నియమించింది. తమకు అవకాశం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్‌కు, సహకరించిన నాయకులకు బోగి కోటేశ్వరరావు, డైరెక్టర్లు కృతజ్ఞతలు తెలిపారు.

క్రీడాకారులకు అభినందన

మంగళగిరి టౌన్ : గుంటూరుకు చెందిన గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ మంత్లీ మ్యాగజైన్ ఉగాదిని పురస్కరించుకుని జిల్లాకు చెందిన శిక్షకులు, సీనియర్ క్రీడాకారులు, క్రీడా ప్రోత్సాహకులకు ఉగాది క్రీడా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరికి చెందిన విజేత స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, కోచ్ పీవీఎస్డీ సత్యనారాయణ, సభ్యులు శంకర్ రెడ్డి, రమేష్‌కు ఉగాది క్రీడా పురస్కారాలు దక్కాయి. వీరికి సోమవారం అభినందనలు తెలిపారు.

మూడో రోజుకు చేరిన ఎడ్ల పందేలు

తెనాలిరూరల్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఆలపాటి శివరామకృష్ణయ్య స్మారక జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన మూడో రోజుకు చేరుకుంది. సోమవారం సాయంత్రం ఆరుపళ్ల విభాగం పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల్లో 14 జతల ఎడ్లు పాల్గొనగా రాత్రి 10.15 వరకు పోటీలు కొనసాగాయి. అలాగే గురువారం రాత్రి నాలుగు పళ్ల విభాగం పోటీలు ముగిశాయి. మూడో రోజు ముఖ్య అతిథిగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఎడ్ల బలప్రదర్శనలు రైతాంగానికి ప్రోత్సాహాన్నివ్వడంతో పాటు పశు పోషకులను ప్రోత్సహిస్తాయని మంత్రి వివరించారు. ఇంత వరకు ఇంత భారీ ఎడ్లబల ప్రదర్శనను తాను చూడలేదని చెప్పారు. నాలుగు పళ్ల విభాగం విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. నాలుగు పళ్ల విభాగంలో బాపట్ల జిల్లా జె.పంగులూరుకు చెందిన రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ యూత్ ఎడ్ల జత నిర్ణీత సమయంలో 4260.03 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ జత ప్రతినిధులకు మంత్రి బహుమతులను అందజేశారు. నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ అధికార ప్రతినిధి వర్ల రామయ్య, ఎస్. అబద్దయ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పోటీల కన్వీనర్ నక్కా ఆనందబాబు పర్యవేక్షించారు.



నాలుగు పళ్ల విభాగంలో విజేతకు బహుమతి అందజేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

పాల పోటీలు ప్రారంభం..

ఆవు పాల పోటీలను ప్రారంభమయ్యాయి. పద్మశాలి వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్‌నందం అబద్దయ్య పోటీలను ప్రారంభించారు. మంగళవారం ఉదయం, సాయంత్రం పాలు పితికి విజేతలను ప్రకటిస్తారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.నాగిరెడ్డి, విశ్రాంత వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్ ఆలపాటి వెంకట్రామయ్య పర్యవేక్షిస్తున్నారు.

ఈద్గా ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: రంజాన్ పండుగ నేపథ్యంలో ఈద్గా ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. చెంచుపేటలోని ఈద్గాను సోమవారం ఉదయం ఆయన పరిశీలించారు. రంజాన్ ప్రార్థనల అనంతరం కూడా ఆవరణను శుభ్రం చేయాలని సూచించారు.



ప్రార్థనలకు ఎటువంటి ఇబ్బందు లు కలుగకుండా చర్యలు తీసుకున్నామని చెప్పా రు. ఈద్గా రోడ్డు మొత్తాన్ని శుభ్రం చేయించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, ముస్లిం మత పెద్దలు ఉన్నారు.

కార్మికుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్: కూటమి ప్రభుత్వం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరాన్ని యూనియన్ నాయకులు కె.ఆదినారాయణ, కూరపాటి స్టీవెన్‌లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ సుమారు 30 సంవత్సరాల క్రితం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీని అక్రమ లాకౌట్ చేసి కార్మికులను నడివీధిలో నిలబెట్టారని విమర్శించారు. ప్రభుత్వాలు మారుతున్న కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కాకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.గురవయ్య, వై. రమాదేవి, టి. దుర్గా భవాని, ఇమాంబి, సారమ్మ, సుబ్బారావు, హగ్గయ్య, బి. నవనీతం పాల్గొన్నారు.

బాలుడిపై పెంపుడు కుక్కల దాడి

దుగ్గిరాల: నాలుగు సంవత్సరాల బాలుడిపై పెంపుడు కుక్కల దాడి చేసిన ఘటన పేరుకలపూడి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఎస్సీ కాలనీకి చెందిన అట్లూరి కల్యాణ్‌కుమార్ కొడుకు సర్దార్ ఆరుబయట ఆడుకుంటూ ఉండగా కుక్కలు ఒక్కసారి దాడి చేశాయి. బాలుడి కాలు, వీపుపై గాట్లు పడ్డాయి. బాలుడిని స్థానిక ఈమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఓకే ఇంటిలో సుమారు ఎనిమిది కుక్కలు ఉన్నాయని, గతంలో కూడా చాలా మందిని గాయపరిచాయని బాలుడి తల్లి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. ఈ ఘటనపై పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



నల్లబాడ్జీలతో నిరసన వ్యక్తం చేసిన ముస్లింలు

అమర్తలూరు(వేమూరు): వక్ఫ్ బోర్డును దుర్వినియోగం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని మైనార్టీ నాయకుడు హుస్సేన్ ఆరోపించారు. రంజాన్ పండగ సందర్భంగా సోమవారం ప్రార్థనల అనంతరం ముస్లింలు నల్ల బాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. హుస్సేన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు బిల్లును ముస్లిం సంఘాలు వ్యతిరేకించడం జరిగిందన్నారు. ముస్లిం సామాజిక వర్గం సంపాదించిన ఆస్తులును కేంద్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసేందుకు కుట్ర చేస్తుందన్నారు. అందరూ కలిసి కేంద్రం కుట్రపై పోరాడాలన్నారు. పలువురు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

శాంతి ర్యాలీని జయప్రదం చేయాలి

తెనాలిటౌన్: పాస్టర్ ప్రవీణ్ పగడాల అకాల మృతికి చింతిస్తూ ఆయన మృతికి కారకులైన దోషిని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఏప్రిల్ 2వ తేదీ బుధవారం నిర్వహించే శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని క్రైస్తవ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఐతానగర్‌లో సోమవారం ఈరే న్యూ లైఫ్ ఫ్యామిలీ వర్షిప్ చర్చి నందు క్రైస్తవ సంఘ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ కూచిపూడి అబ్రహాం మాట్లాడుతూ స్థానిక చెంచుపేటలోని ఉమేష్‌చంద్ర విగ్రహం వద్ద నుంచి శాంతి ర్యాలీ ప్రారంభమవుతుందని, ప్రతి ఒక్కరూ ఈ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని క్రైస్తవ సమాజానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రెవరెండ్ ఎ.భానుప్రసాద్, బిషప్ కె.సుధీర్ కుమార్, బ్రదర్ పి.ఐజక్, బిషప్ జె.ప్రభుదాసు, బ్రదర్ సల్మాన్, రావూరి విక్టర్ పాల్, మార్టిన్ లూథర్‌బాబు, టి.శ్యామూల్, బ్రదర్ ఆనందన్న, ఎస్.చిట్టిబాబు, అబ్రహాం, స్టీఫెన్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న క్రైస్తవ సంఘాల నాయకులు

మురుగు సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లి రూరల్ : తాడేపల్లిలో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని గుండిమెడ ప్రాంతంలో పార్టీ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, గ్రామ కార్యదర్శి నాగపోగు విజయరాజుతో కలసి దళిత వాడలోని మురుగును పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లెకృష్ణ మాట్లాడుతూ గుండిమెడ గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఎక్కడి మురుగు నీరు అక్కడే నిలిచి పోతోందని, పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తామని అధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో, పరిసరాలలో వాడిన వ్యర్థపు మురుగునీరు నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతోందన్నారు. దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ మురుగు నీరు భూగర్భ జలాలలో ఇంకిపోవడం వలన తాగునీరు కూడా కలుషితమవుతుందని చెప్పారు.

చినపరిమి వద్ద అధ్వానంగా ఉన్న తెనాలి- చినపరిమి రోడ్డు



చినపరిమి హద్దు వరకు మరమ్మతులు చేసిన దృశ్యం



రోడ్డు మరమ్మతుల్లోనూ వివక్ష..!

రహదారుల నిర్మాణం, మరమ్మతుల్లోనూ కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతోంది. వేమూరు నియోజకవర్గంలో నూతన రోడ్ల నిర్మాణం దేవుడెరుగు.. మరమ్మతులను సైతం గాలికొదిలేసింది. విషయమేమిటంటే.. చుండూరు మండలంలోని చినపరిమి నుంచి తెనాలి వెళ్లే రోడ్డును అటువైపు తెనాలి నుంచి మరమ్మతులు చేస్తూ వచ్చిన సిబ్బంది వేమూరు నియోజక వర్గ సరిహద్దు వద్ద, చిన పరిమికి ఒక కిలోమీటరు దూరంలో మరమ్మతులు ఆపేశారు. దీంతో చినపరిమి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం వరకు రోడ్డు వేయాలని అధికారులకు పలుసార్లు అర్జీలు అందజేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

–వేమూరు